# సాక్షి మెదక్

సోమవారం । 21 । ఆగస్టు । 2023






**లక్షలు లాగేస్తున్నారు!** 8లో

సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. పార్ట్‌టైం జాబ్ పేరిట లింకులు పంపి అమాయకుల నుంచి డబ్బులు లాగేస్తున్నారు.



**చోరీలతో గుమ్మడిదడ** 8లో

గుమ్మడిదల మండలంలో జరుగుతున్న వరుస దొంగతనాలతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. నెల రోజులుగా మూడు చోరీలు జరిగాయి.

**నేటి ప్రజావాణి రద్దు**

మెదక్ కలెక్టరేట్: నేడు నిర్వహించాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని అనివార్య కారణాల వల్ల రద్దు చేసినట్లు కలెక్టర్ రాజర్షిషా ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్జీలు అందించేందుకు దూర ప్రాంతాల నుంచి వచ్చే వారు విషయాన్ని గమనించాలన్నారు. కార్యక్రమం రద్దు దృష్ట్యా ప్రజలు ఎవరూ కలెక్టరేట్‌కు తరలిరావొద్దని ఆయన కోరారు.

## న్యూస్‌రీల్

### కిషన్‌రెడ్డిని కలిసిన నాయకులు



కిషన్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

మనోహరాబాద్(తూప్రాన్): రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని మనోహరాబాద్ మండల బీజేపీ నాయకులు ఆదివారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండల సమస్యలను కిషన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లినట్లు మండల అధ్యక్షుడు కమ్మరి నరేందర్‌చారి తెలిపారు. అనంతరం వీరిని ఆయన శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి వెంకటేష్‌గౌడ్, నాయకులు రాజు, నీల రమేష్, తదితరులున్నారు.

### మరోసారి బీఆర్‌ఎస్‌దే అధికారం



మాట్లాడుతున్న ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి

చేగుంట(తూప్రాన్): రాష్ట్రంలో మళ్లీ బీఆర్‌ఎస్ సర్కారే అధికారంలోకి వస్తుందని ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం చేగుంటలో నిర్వహించిన బీఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ నెల 23న జిల్లాలో సీఎం పర్యటనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికల్లో దుబ్బాక నుంచి పోటీ చేసే అవకాశం ఉందని, తనను గెలిపిస్తే నియోజవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వెంగళ్‌రావు, ఎంపీపీ మాసుల శ్రీనివాస్, జెడ్పీటీసీ ముదాం శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు బక్కి వెంకటయ్య, చేగుంట, నార్సింగి మండలాల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మంచికట్ల శ్రీనివాస్, అశోక్ పాల్గొన్నారు.

### లక్ష్యం మేరకు మొక్కలు నాటాలి



సూచనలు చేస్తున్న డీఎఫ్‌ఓ రవిప్రసాద్

కౌడిపల్లి(నర్సాపూర్): హరితహారంలో భాగంగా మండలంలోని జాతీయ రహదారికి ఇరువైపులా విస్తృతంగా మొక్కలు నాటాలని జెడ్పీసీఈఓ శైలేష్, డీఎఫ్ఓ రవిప్రసాద్ అధికారులకు సూచించారు. ఆదివారం ఎంపీడీఓ శ్రీనివాస్ ఆధ్వర్యంలో కౌడిపల్లి నుంచి తునికి హరిచంద్‌తండా వరకు మొక్కలు నాటే పనులను వేర్వేరుగా పరిశీలించారు. లక్ష్యం మేరకు మొక్కలు నాటి రక్షణ చర్యలు చేపట్టాలని కార్యదర్శులకు ఆదేశించారు. రహదారి పక్కన ప్లాస్టిక్ వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ కలీముల్లా, ఏపీఓ పుణ్యదాస్, ఈసీ ప్రేంకుమార్, కార్యదర్శులు వెంకటేశం, సౌజన్య, సదియాబేగం, రాజిరెడ్డి, శైలజ, రేణుక పాల్గొన్నారు.

### 147వ రోజు దీక్ష



దీక్షలో అఖిలపక్ష నాయకులు

రామాయంపేట(మెదక్): రెవెన్యూ డివిజన్ సాధన కోసం రామాయంపేటలో నిర్వహిస్తున్న దీక్షలు ఆదివారం 147వ రోజుకు చేరుకున్నాయి. ప్రభుత్వం డివిజన్ ప్రకటించే వరకు విశ్రమించమని అఖిలపక్ష ప్రతినిధులు హెచ్చరించారు. దీక్షకు యువజన, కుల, వ్యాపార సంఘాలు మద్దతు ప్రకటించాయి.

### దరఖాస్తుల ఆహ్వానం

మెదక్ కలెక్టరేట్: ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల కోసం జిల్లాలో అర్హత, ఆసక్తిగల టీచర్లు ఈ నెల 28వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ రాధాకిషన్ తెలిపారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవలందించిన వారికి అవార్డులు అందించనున్నట్లు పేర్కొన్నారు. పాఠశాలలో వందశాతం ఉత్తీర్ణత, పదో తరగతిలో 9 జీపీఏ ఆపై గ్రేడ్లు, బడుల్లో మౌలిక వసతుల అభివృద్ధి, హరిత హారం, విజయాలు తదితర అంశాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రధానోపాధ్యాయులు బోధనలో 15 ఏళ్లు, ఉపాధ్యాయులకు 10 ఏళ్ల అనుభవం ఉండాలన్నారు.



**ఏడుపాయలలో భక్తజన సందోహం**

పాపన్నపేట(మెదక్): ఏడుపాయల వనదుర్గా ఆలయం ఆదివారం జనసందోహంగా మారింది. వివిధ ప్రదేశాల నుంచి తరలి వచ్చిన భక్తులు మంజీరా నదిలో స్నానాలు చేసి దుర్గమ్మను దర్శించుకున్నారు. బోనాలు, ఒడి బియ్యం తీసి మొక్కులు తీర్చుకున్నారు. పూజారులు పార్థివ శర్మ, శంకర శర్మ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. భక్తులకు ఇబ్బంది కలుగకుండా పాలకవర్గ చైర్మన్ బాలాగౌడ్, ఈఓ సార శ్రీనివాస్, ఉద్యోగులు ఏర్పాట్లు చేశారు.



**కొమురవెల్లిలో కోలాహలం**

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. శ్రావణమాసం సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున రావడంతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. పట్నాలు, అభిషేకాలు, అర్చన, ఒడిబియ్యం, కేశఖండన, గంగిరేణి చెట్టుకు భక్తులు ముడుపులు కట్టారు. ఆలయ చైర్మన్ గీస భిక్షపతి, ఏఈఓ అంజయ్య, ప్రధానార్చకులు మహాదేవుని మల్లికార్జున్ పరిశీలించారు.



**నాచగిరిలో శ్రావణశోభ**

వర్గల్(గజ్వేల్): సుప్రసిద్ధ నాచగిరి లక్ష్మీనృసింహక్షేత్రం ఆదివారం శ్రావణ శోభతో అలరారింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు సత్యనారాయణ స్వామి వ్రతాలు, అభిషేకాలు నిర్వహించారు. దీంతో క్షేత్రంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఆలయ ఈఓ అన్నపూర్ణ పర్యవేక్షణలో జాగ్రత్తలు తీసుకున్నారు. సోమవారం నుంచి సెప్టెంబర్ 10 వరకు లక్ష్మీనృసింహ శ్రీసుదర్శన మహా హోమం నిర్వహిస్తున్నట్లు ఆలయ వర్గాలు తెలిపాయి.

# నర్సాపూర్ బరిలో నాయక్!

- నేతలను సంప్రదిస్తున్న మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్
- గిరిజనుల ఓట్లే లక్ష్యంగా పావులు
- ఎస్టీ జనాభా ప్రకారం సీట్లు కేటాయించాలని వినతి
- కాంగ్రెస్ అధిష్టానం వద్ద వేడుకోలు



మెదక్: సబావత్ రాములు నాయక్. తెలంగాణ ఉద్యమకారులకు పరిచయం అక్కర్లేని పేరు. తన రైట్ హ్యాండ్ రాములు నాయకేనని గతంలో కేసీఆర్ స్వయంగా ప్రకటించారు. అనతి కాలంలో బీ ఆర్ ఎస్‌తో విభేదించి కాంగ్రెస్‌లో చేరిన ఆయన ప్రస్తుతం పయనమెటో? అనే దానిపై అందరి దృష్టి పడింది. ఎస్టీ రిజర్వ్‌డ్ స్థానాల నుంచి కాకుండా జనరల్ స్థానంపై ఆయన కన్నేశారనే వార్తలు జిల్లా రాజకీయాల్లో చర్చనీయాంశమయ్యాయి. ఇందుకు మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గం కేంద్రంగా మారిందనే టాక్ వినిపిస్తోంది. దీనికి తగ్గట్టుగానే స్థానిక గిరిజన నేతలతో ఆయన సంప్రదింపులు జరుపుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. నర్సాపూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో అభ్యర్థి గెలుపును ప్రభావితం చేసేది గిరిజనులే. నర్సాపూర్, చిలప్‌చెడ్, కౌడిపల్లి, హత్నూర, కొల్చారం, శివ్వంపేట, వెల్దుర్తి, మాసాయిపేట మండలాల్లో ఎస్టీ జనాభా కూడా అధికంగా ఉంది. నర్సాపూర్, కౌడిపల్లి మండలాలు ఎంపీపీ అధ్యక్షుడిగా ప్రస్తుతం ఆ సామాజిక వర్గం నేతలే కొనసాగుతున్నారు. ఇప్పటి వరకు ఇక్కడ రెడ్డి సామాజిక వర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికవుతుండగా, ప్రధాన రాజకీయ పార్టీలన్ని రెడ్డి వర్గానికే టికెట్లు కూడా కేటాయిస్తున్నాయి. దీనికి భిన్నంగా ఈ సారి జనాభా ప్రాతిపదికన టికెట్ కేటాయించాలనే డిమాండ్ వినిపిస్తోంది. కాంగ్రెస్ అధికారంలోకి రావాలంటే ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 50 శాతానికి పైగా టికెట్లు ఇవ్వాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలిసింది. దీంతో ఎస్సీ, ఎస్టీ నేతలు రిజర్వ్‌డ్ స్థానాలతో పాటు జనరల్ స్థానాల్లోనూ టికెట్లు కేటాయించా లని హైకమాండ్ వద్ద పట్టుబడుతున్నట్లు సమాచారం.

### నాయక్ మదిలో ఏముంది?

మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ కాంగ్రెస్‌లో చేరే ముందు తన పదవిని కూడా కోల్పోయారు. కేసీఆర్‌తో విభేదించి కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు ప్రకటించారు. కాగా రాములు నాయక్‌ను ఏదో ఒక స్థానం నుంచి బరిలో దింపి ఎస్టీ ఓట్లను తమ వైపు మలుపుకోవాలని కాంగ్రెస్ భావిస్తున్నట్లు తెలిసింది. దక్షిణ తెలంగాణలో ఎస్టీ రిజర్వ్‌డ్ స్థానాలు లేకపోవడం, ఉత్తర తెలంగాణలో ఆదివాసీ – లంబాడ తెగల మధ్య వైరుధ్యం కారణంగా అక్కడ టికెట్ కేటాయించడం అంత శ్రేయస్కరం కాదనే వాదన వినిపిస్తోంది. దీంతో తనను అన్‌రిజర్వ్‌డ్ స్థానం నుంచి బరిలో ఉంచాలని పట్టుబడుతున్నట్లు తెలిసింది. గిరిజనుల ఓట్లు ఎక్కువగా ఉన్న నర్సాపూర్ నుంచి తాను పోటీలో నిలుస్తానని, ఇప్పటికే ఈ విషయంపై కాంగ్రెస్ హైకమాండ్‌కు చెప్పానని రాములు నాయక్ తన అనుచరులకు ప్రకటించారు. సుమారు 48 వేల మంది ఓటర్లు ఉన్న నర్సాపూర్ నుంచి కాంగ్రెస్ తరఫున పోటీ చేస్తే పార్టీకి కూడా కలిసివచ్చే అంశంగా భావిస్తున్నట్లు తెలుస్తోంది.



గంగాపూర్ అటవీ ప్రాంతంలో చెట్లను తొలగించి చదును చేసిన దృశ్యం

# అడవిని హరిస్తున్నారు

- గంగాపూర్ అటవీ ప్రాంతంలో చెట్ల నరికివేత, ట్రాక్టర్‌తో చదును

మెదక్: రెండేళ్లుగా జిల్లాలో అడవుల విధ్వంసం పెరిగింది. మొన్న కప్రాయిపల్లి, రాజిపేటలో అటవీ ప్రాంతంలో చెట్లను నరికివేయగా.. నేడు గంగాపూర్ వద్ద చెట్లను తొలగించి ఆనవాళ్లు లేకుండా భూమిని చదును చేశారు. వారం రోజుల క్రితం హవేళీఘనాపూర్ మండలం కప్రాయిపల్లి, రాజిపేట శివారులో సుమారు 50 ఎకరాల్లో చెట్లను తొలగించగా, మూడు రోజుల క్రితం హవేళీఘనాపూర్ మండలం గంగాపూర్ అడవిలో చెట్లను నరికి ట్రాక్టర్లతో చదును చేశారు. పాపన్నపేట మండలం నామాపూర్, నార్సింగ్‌లో 100 ఎకరాల్లో, భూర్గుపల్లి, గాజిరెడ్డిపల్లిలో 10 ఎకరాల్లో చెట్లను నరికి వేశారు. అడవులను నరికేస్తున్నా.. అటవీ అధికారులు పట్టించుకోవడంలేదు. విషయం మీడియాలో వచ్చినప్పుడే అధికారులు హడావుడి చేస్తున్నారే తప్ప కఠిన చర్యలు తీసుకోవడంలేదనే విమర్శలున్నాయి. పచ్చదనం కోసం కోట్లు ఖర్చు చేసి మొక్కలు నాటుతుంటే మరోవైపు అక్రమార్కులు విచ్చల విడిగా అడవులను నరికేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి రక్షణ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# హామీల అమలులో విఫలం



మాట్లాడుతున్న మ్యాదం బాలకృష్ణ

- పీసీసీ అధికార ప్రతినిధి బాలకృష్ణ

మెదక్: ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో బీఆర్‌ఎస్ విఫలమైందని, త్యాగం కాంగ్రెస్ పార్టీది కాగా.. భోగం బీఆర్‌ఎస్ నాయకులు అనుభవిస్తున్నారని కాంగ్రెస్ అధికార ప్రతినిధి మ్యాడమ్ బాలకృష్ణ అన్నారు. ఆదివారం విలేకరులతో మాట్లాడారు. రెండు పర్యాయాలు ప్రజలు బీఆర్‌ఎస్‌కు అధికారం ఇచ్చినా ప్రజల ఆకాంక్షలను సాకారం చేయడంలో విఫలమయ్యారన్నారు. ప్రజాదరణ కోల్పోయి అధికారం చేజారుతుందనే బాధలో మంత్రి హరీశ్‌రావు కాంగ్రెస్‌పై విషం కక్కుతున్నారని విమర్శించారు. మెదక్ జిల్లా వనరులు సిద్దిపేటకు తరలిపోతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హఫీజ్ మొల్ సాబ్, మాజీ కౌన్సిలర్ విక్రమ్, సోషల్ మీడియా జిల్లా కోఆర్డినేటర్ షేక్ సల్మాన్, పట్టణ కోఆర్డినేటర్ నవీన్ చౌదరి, ఎస్సీ సెల్ నాయకుడు సంజీవ్, అశోక్ రెడ్డి, జాకీర్, ఆమీర్, జకారియా తదితరులు పాల్గొన్నారు.

### ఉత్తమ ఇంజనీర్లుగా ఎదగాలి



గ్రాడ్యుయేషన్ డేలో జేఎన్‌టీయూ రిజిస్ట్రార్, కాలేజీ ప్రతినిధులు

నర్సాపూర్: నర్సాపూర్‌లోని బీవీ రాజు ఇంజనీరింగ్ కాలేజీ ఉత్తమ ఇంజనీర్లను సమాజానికి అందించడం శుభపరిణామమని జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ మంజూర్ హుస్సేన్ అన్నారు. ఆదివారం కాలేజీలో నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డే వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాలేజీ జేఎన్‌టీయూకి అనుబంధంగా ఉంటూ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతున్నారని అన్నారు. విష్ణు ఎడ్యుకేషన్ సొసైటీ వైస్‌చైర్మన్ రవిచంద్రన్ రాజగోపాల్ మాట్లాడుతూ.. అవకాశాలను అందిపుచ్చుకొని యువత భవిష్యత్‌లో రాణించాలన్నారు. కార్యక్రమంలో కాలేజీ డైరెక్టర్ లక్ష్మీప్రసాద్, కాలేజీ ప్రిన్సిపాల్ సంజయ్‌దూబె, పలు విభాగాల హెచ్‌ఓడీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా విభాగాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, ప్రశంస పత్రాలతో పాటు పలువురికి బంగారు పతకాలు అందజేశారు.

### 'వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే'

టేక్మాల్(మెదక్): వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని కాంగ్రెస్ పార్టీ నాయకురాలు త్రిష దామోదర్ అన్నారు. ఆదివారం మండలంలోని దాదాయిపల్లి గ్రామంలో పల్లెపల్లెకు త్రిషమ్మ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తిరుగుతూ గ్రామస్తులతో మాట్లాడారు. గతంలో కాంగ్రెస్ చేసిన అభివృద్ధిని వివరించారు. బీఆర్‌ఎస్ పార్టీ ఇచ్చిన హామీల అమలులో విఫలమయిందన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నిమ్మ రమేశ్, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు సంగమేశ్వర్ గౌడ్, మండల వైస్ ఎంపీపీ మంజుల రాజుగౌడ్, మండల కో ఆప్షన్ సభ్యులు మజర్, జిల్లా ఎన్ఎస్‌యూఐ నాయకులు మహేశ్‌రెడ్డి, అశోక్ గౌడ్, మండల ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు అడివయ్య, మండల యువజన కాంగ్రెస్ నాయకులు సిద్దు, ఖాజా, దాదాయిపల్లి గ్రామ అధ్యక్షుడు సుధాకర్‌గౌడ్, యువజన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# రోడ్డు నిబంధనలు పాటించాలి

- మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

పాపన్నపేట(మెదక్): వాహన చోదకులు రోడ్డు నియమాలు పాటించి ప్రమాదాల నివారణకు సహకరించాలని మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని లక్ష్మీనగర్‌లో 150 మందికి డ్రైవింగ్ లైసెన్సులు అందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. నియోజకవర్గ వ్యాప్తంగా 13 వేల దరఖాస్తులు వచ్చాయని, ఇందులో అర్హులైన వారికి లైసెన్సు అందిస్తామన్నారు. వాహనం నడిపేటప్పుడు లైసెన్స్, ఇన్సూరెన్స్ పత్రాలు కలిగి ఉండాలన్నారు. నిర్లక్ష్యంపు డ్రైవింగ్‌తో రోడ్డు ప్రమాదాలు జరిగి మృత్యువాత పడుతున్నారని, రోడ్డు నిబంధనలు పాటించి ప్రమాదాల నివారణకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, ఏడుపాయల చైర్మన్ బాలాగౌడ్, పాపన్నపేట మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటరాంరెడ్డి, సర్పంచులు అనురాధ, గురుమూర్తి, లింగారెడ్డి, నవన్, ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు కుబేరుడు పాల్గొన్నారు.



లైసెన్స్‌లు అందుకున్న వారితో ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, తదితరులు

# మెదక్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు



ప్రార్థనలో భక్తులు, ఇన్‌సెట్‌లో దైవసందేశం ఇస్తున్న ప్రెసిబెటరీ ఇన్‌చార్జ్ శాంతయ్య

మెదక్: ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మెదక్ సీఎస్ఐ చర్చిలో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు కొనసాగాయి. ఉదయం, మధ్యాహ్నం రెండు పర్యాయాలు భక్తులు ప్రార్థనలు నిర్వహించారు. చర్చి ప్రెసిబెటరి ఇన్‌చార్జ్ శాంతయ్య భక్తులకు దైవ సందేశమిచ్చి ఆశీర్వదించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చర్చి నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.

# బీజేపీతోనే దేశ, రాష్ట్ర అభివృద్ధి

- లక్నో ఎమ్మెల్యే రాజేశ్వర్ సింగ్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజేశ్వర్‌సింగ్

నర్సాపూర్: బీజేపీతోనే దేశ, రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని నర్సాపూర్ నియోజకవర్గ బీజేపీ పరిశీలకుడు ఉత్తరప్రదేశ్ రాష్ట్రం లక్నో ఎమ్మెల్యే రాజేశ్వర్‌సింగ్ అన్నారు. ఆదివారం మండలంలోని టీఎన్జీఓస్ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీఆర్‌ఎస్ కుటుంబపాలనతో ప్రజలు విసిగిపోయారని, రాబోయే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి వస్తుందని అన్నారు. ప్రధాని మోదీ హయాంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని కొనియాడారు. ఆయుష్మాన్ భారత్ లాంటి కేంద్ర సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడం లేదని, నిధులను దారి మళ్లించి ఇతర పథకాలకు వాడుతున్నారని ఆరోపించారు. సమావేశంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ మురళీయాదవ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సింగాయిపల్లిగోపి, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ మల్లేష్‌గౌడ్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు చిన్న రమేష్‌గౌడ్, జిల్లా కార్యదర్శి సురేష్, నాయకులు రఘువీరారెడ్డి, బుచ్చేష్‌యాదవ్, రాజేందర్‌యాదవ్, బాల్‌రెడ్డి, ఆంజనేయులుగౌడ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు. రాజేశ్వర్‌సింగ్ వారం రోజుల పాటు నర్సాపూర్‌లో ఉండి నియోజకవర్గంలో పర్యటిస్తారని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ మల్లేష్‌గౌడ్ తెలిపారు.

**మహిళలతో మాటామంతి...**

నర్సాపూర్ రూరల్: నర్సాపూర్ మండల పరిధిలోని పెద్దమ్మ తండాలో పర్యటించిన ఉత్తరప్రదేశ్ రాష్ట్రం లక్నో జిల్లా సరోజ్ నగర్ ఎమ్మెల్యే రాజేశ్వర్ సింగ్ గిరిజన మహిళలతో మాట్లాడారు. బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశం అనంతరం తిరుగు ప్రయాణంలో పెద్దమ్మ తండా వద్ద గిరిజన మహిళలను చూసి ఆగారు. రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా.. డబుల్ బెడ్ రూమ్ ఇల్లు అందిందా.. అని అడిగారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వం వస్తుందని, సమస్యలను పరిష్కరిస్తామని అన్నారు. నాయకులు సింగయ్యపల్లి గోపి, సురేష్, రఘువీరా రెడ్డి, చిన్న రమేష్ గౌడ్, మల్లేష్ గౌడ్, ఎస్టీ మోర్చా మండల అధ్యక్షుడు ధనావత్ సురేష్ నాయక్, ఆంజనేయులు ఉన్నారు.

## క్లుప్తంగా

### అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి


రంజిత్ చౌవాన్ (ఫైల్)

జహీరాబాద్ టౌన్: మండల పరిధిలోని తుంకుంట గ్రామ శివారులో రైలు పట్టాలపై అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి చెందాడు. మృతుడు జహీరాబాద్ మండలం జమాల్ తండాకు చెందిన రంజిత్ చౌవాన్(19)గా వికారాబాద్ రైల్వే పోలీసులు గుర్తించారు. హెడ్‌కానిస్టేబుల్ అనిల్ కుమార్ వివరాలు ఇలా ఉన్నాయి. జమాల్ తండాకు చెందిన పాండు చౌవాన్ కుమారుడు రంజిత్ చౌవాన్(19) జేసీబీ డ్రైవర్. వికారాబాద్ జిల్లాలో పనిచేస్తున్న సమయంలో చిట్టంపల్లికి చెందిన ఓ అమ్మాయితో రంజిత్ ప్రేమలో పడ్డాడు. ఇతనిపై చందానగర్‌లో పీఎస్‌లో ఫిర్యాదు కూడా ఉంది. ప్రేమ వ్యవహారం కారణంగానే ఆత్మహత్య చేసుకుని ఉంటాడని అనుమానిస్తున్నారు. నాలుగు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిన తన కుమారుడిని హత్యచేసి రైలు పట్టాలపై పడేసి ఉంటారని రంజిత్ తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ వివరించారు.

### వీధికుక్క దాడిలో బాలుడికి తీవ్ర గాయాలు


గాయపడిన భరత్‌రెడ్డి

జహీరాబాద్ టౌన్: మొగుడంపల్లి మండలం జాడిమల్కాపూర్‌లో వీధి కుక్క దాడిలో ఓ బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. గ్రామానికి చెందిన వెంకట్‌రెడ్డి కుమారుడు భరత్‌రెడ్డి(8) ఆదివారం పొలానికి వెళ్తుండగా దారిలో ఉన్న కుక్క ఒక్కసారిగా దాడి చేసింది. పిల్లవాడు కేకలు వేయడంతో పక్కపొలంలో ఉన్న అతని బాబాయ్ పరుగెత్తుకుంటూ వచ్చి దానిని తరిమేశాడు. అప్పటికే బాలుడి ముఖం, తలపై తీవ్రగాయాలయ్యాయి. వెంటనే జహీరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు.

### గుర్తుతెలియని అస్థిపంజరం లభ్యం

పటాన్‌చెరు టౌన్: అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం గుర్తుతెలియని అస్థిపంజరం లభ్యమైంది. ఎస్‌ఐ ఈవీ రమణ వివరాలు.. అమీన్‌పూర్ మండలం గండిగూడ కాలనీ ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలో ఉన్న నీటి గుంతలో గుర్తు తెలియని వ్యక్తి అస్థిపంజరం లభ్యమైంది. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అస్థిపంజరంపై ఉన్న దుస్తుల ఆధారంగా మృతుడు పురుషుడిగా గుర్తించారు. మృతిచెంది సుమారు నెలకు పైగా కావొచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఘటనా స్థలం వద్దే వైద్యుల సమక్షంలో పోస్టుమార్టం నిర్వహించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

**యువకుడి మృతదేహం..**


నీటి గుంతలో మృతదేహం

నారాయణఖేడ్: పట్టణ శివార్లలోని మనూరు క్రాస్‌రోడ్డు సమీపంలోని నీటి గుంతలో ఆదివారం ఉదయం 35 నుంచి 40 ఏళ్ల మధ్య వయస్సు గల గుర్తుతెలియని యువకుడి శవం లభించిందని ఎస్‌ఐ విద్యాచరణ్‌రెడ్డి తెలిపారు. మృతదేహంపై దుస్తులు లేవని తెలిపారు. మృతుడిని గుర్తిస్తే ఈ నెంబర్లకు 8712656757, 7032912233 సమాచారం అందించాలని అన్నారు.



# రూ.లక్షలు లాగేస్తున్నారు

ఇప్పుడు ప్రతిఒక్కరూ డిజిటల్ పేమెంట్‌లు, ఆన్‌లైన్ లావాదేవీలు నిర్వహిస్తున్నారు. వీటిల్లో కీలకమైన ఓటీపీ నెంబర్ తెలుసుకొని సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. పార్ట్‌టైం జాబ్‌లు అంటూ లింకులు పంపుతూ డబ్బులు దండుకుంటున్నారు. కొన్ని టాస్కులు ఇచ్చి పూర్తి చేస్తే రెట్టింపు నగదు వస్తుందని ఆశ చూపుతూ క్షణాల్లో లక్షల రూపాయలు దోచుకుంటున్నారు.

- రెచ్చిపోతున్న సైబర్ నేరగాళ్లు
- ఈ ఏడాది జూలై వరకు 1600 కేసులు
- ఫోన్‌కాల్, లింకులతో క్షణాల్లో బురిడీ
- బాధితులు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, చదువుకున్నవారే అధికం



పటాన్‌చెరు టౌన్: సంగారెడ్డి జిల్లాలో ఈ ఏడాది జనవరి నుంచి జూలై వరకు 1600 సైబర్ క్రైంలు జరిగాయి. అందులో 147 కేసులకు ఎఫ్‌ఐఆర్ నమోదైంది. అత్యధికంగా అమీన్‌పూర్, పటాన్‌చెరు పోలీసు స్టేషన్ పరిధిలో నమోదయ్యాయి. మోసపోయిన వారంతా సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, చదువుకున్న వారే కావడం గమనార్హం.

ఆన్‌లైన్‌లో అపరిచితులతో జాగ్రత్తగా ఉండాలని పోలీసులు హెచ్చరిస్తున్నా కొందరు సైబర్ నేరగాళ్ల వలలో పడుతూనే ఉన్నారు. ఇటీవల ఒక్కో పోలీసు స్టేషన్లలో ఒకే రోజు రెండు మూడు కేసులు నమోదవుతుండడం ఆందోళన కలిగిస్తోంది. జరిగిన మోసం గురించి గంటల వ్యవధిలో బాధితులు 1930కు ఫోన్ చేసి సైబర్ పోలీసులకు చెబితే అకౌంట్ ఫ్రీజ్ చేయడంతోపాటు డబ్బు రాబట్టే ప్రయత్నం చేస్తున్నారు. అయితే ఈ కేసుల్లో సైబర్ నేరగాళ్లను పట్టుకున్న ఘటనలు చాలాతక్కువే ఉన్నాయి.

**ఇటీవల మోసపోయిన వారు**

- అమీన్‌పూర్ పరిధిలోని హెచ్‌ఎంటీ స్వర్ణపురి కాలనీకి చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగినికి జూన్ 28వ తేదీన పార్ట్‌టైం జాబ్ అంటూ వాట్సాప్‌కు మెసేజ్ వచ్చింది. దానికి స్పందించడంతో రెట్టింపు నగదు ఇస్తామని చెప్పి 35 దఫాలుగా మొత్తం రూ.46 లక్షలు బాధితురాలి నుంచి కొట్టేశారు. మోసపోయినట్లు గుర్తించి సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.
- అమీన్‌పూర్ పరిధిలోని బీరంగూడ జయలక్ష్మి నగర్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి మే 29న పార్ట్‌టైం ఉద్యోగం కావాలా అంటూ మెసేజ్ వచ్చింది. స్పందించిన బాధితురాలు.. వివరాలు పంపడంతోపాటు అపరిచిత వ్యక్తులు చెప్పిన విధంగా నగదు పంపించింది. చివరకు తాను పెట్టిన రూ.8లక్షల 40వేలను పోగొట్టుకుంది.


అవగాహన కల్పిస్తున్న పోలీసులు (ఫైల్)

**ఇలా మోసపోతున్నారు..**

- పార్ట్‌టైం ఉద్యోగం పేరుతో వచ్చిన మెసేజ్‌కు స్పందించి, వివరాలు నమోదు చేసి రెట్టింపు నగదు ఆశ చూపడంతో నగదు ఇన్వెస్ట్ చేసి డబ్బు పోగొట్టుకుంటున్నారు.
- వర్క్ ఫ్రం హోం ఉద్యోగాల కోసం గూగుల్‌లో వెతుకుతున్న సమయంలో సైబర్ నేరగాళ్లకు చిక్కుతున్నారు.
- ఫేస్ బుక్‌లో వాహనాలు, సెకండ్ హ్యాండ్ వస్తువుల ప్రకటనను క్లిక్ చేసి మోసపోతున్నారు.
- మరి కొందరు మోసగాళ్లు ఏటీఎం కార్డు అప్‌డేట్, ఆరోగ్య భద్రత కార్డులు ఇస్తామని ఫోన్ చేసి మాటల్లో దించి వివరాలు సేకరించి బాధితుడి బ్యాంక్ ఖాతా నుంచి డబ్బు మాయం చేస్తున్నారు.

"జిల్లాలో ఈ ఏడాది 1600మంది సైబర్ నేరగాళ్ల వలలో పడి రూ.10 కోట్ల 88 లక్షల, 63 వేలు పోగొట్టుకున్నారు. అందులో ఒక కోటి 84 లక్షల 42 వేల 307 రూపాయలను ఫ్రీజ్ (హోల్డ్) చేశారు."

**అపరిచితుల మెసేజ్, ఫోన్ కాల్స్‌కు స్పందించొద్దు**



ఆన్‌లైన్‌లో అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే మెసేజ్, ఫోన్ కాల్స్‌కు స్పందించకండి. ప్రస్తుత సైబర్ నేరగాళ్ల వలలో పడి మోసపోతుంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, చదువుకున్న వారే ఎక్కువ. పటాన్‌చెరు సబ్ డివిజన్ పరిధిలోని పటాన్‌చెరు, అమీన్‌పూర్, బీడీఎల్, జిన్నారం, బొల్లారం, గుమ్మడిదల, హత్నూర పోలీసు స్టేషన్ పరిధిలో సైబర్ క్రైం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

– పురుషోత్తంరెడ్డి, డీఎస్పీ, పటాన్‌చెరు

### గద్దర్ పేరును మెదక్ జిల్లాకు పెట్టాలి


మాట్లాడుతున్న డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్

గజ్వేల్: ప్రజాగాయకుడు గద్దర్ పేరును మెదక్ జిల్లాకు పెట్టాలని ప్రజా సంఘాల నాయకులు తీర్మానించారు. ఆదివారం గజ్వేల్‌లోని టీపీటీఎఫ్ కార్యాలయ భవనంలో నిర్వహించిన గద్దర్ సంస్మరణ సభలో డీబీఎఫ్ (దళిత బహుజన ఫ్రంట్) జాతీయ కార్యదర్శి పి.శంకర్, సీనియర్ జర్నలిస్టు ఆస శ్రీరాములు, దళిత బహుజన శక్తి రాష్ట్ర అధ్యక్షుడు దేవీ రవీందర్, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ విద్యుత్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు దాసరి శ్యామ్ మనోహర్, ఎంపీపీ అమరావతి, జెడ్పీటీసీ మల్లేశం, టీపీటీఎఫ్ గజ్వేల్ జోన్ అధ్యక్షులు నరేందర్ పాల్గొని మాట్లాడారు. ప్రజల గొంతుకగా తన జీవితాన్ని ధారబోసిన గద్దర్ పాట చిరస్మరణీయమన్నారు. ఆయన విగ్రహాన్ని ట్యాంక్ బండ్‌పై ఏర్పాటు చేసి స్మృతివనం నిర్మించాలన్నారు. డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి అధ్యక్షతన జరిగిన ఈ సభలో మాల మహానాడు జాతీయ నాయకుడు తుమ్మ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### సఫాయి కార్మికురాలి కొడుకు అగ్నివీర్‌గా..


రమేశ్

రాయపోలు(దుబ్బాక): దౌల్తాబాద్ మండలం కోనాయపల్లి గ్రామ పంచాయతీలో సఫాయి కార్మికురాలి కొడుకు భారత సైనికుడిగా నియామకమయ్యాడు. స్థానిక పంచాయతీలో కార్మికురాలిగా పనిచేస్తున్న గువ్వలపల్లి ఎల్లవ్వ కొడుకు రమేశ్ ఇటీవల భారత ప్రభుత్వం నిర్వహించిన సైనిక పోటీ పరీక్షల్లో ప్రతిభ చాటి అగ్నివీర్‌గా నియామకమయ్యాడు. దీంతో గ్రామస్తులు అతడిని అభినందిస్తున్నారు.

# చోరీలతో గుమ్మడిదడ


విచారణ జరుపుతున్న పోలీసులు

- వరుస దొంగతనాలతో జనం బెంబేలు
- నెల రోజుల్లో మూడు ఘటనలు

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండలంలో జరుగుతున్న వరుస దొంగతనాలతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. నెల రోజులుగా మూడు చోరీలు జరిగాయి. పది రోజుల క్రితం గుమ్మడిదల గ్రామంలోని ఎల్లమ్మ, మల్లమ్మ దేవాలయాల్లోని హుండీలను గుర్తుతెలియని వ్యక్తులు పగులగొట్టి అందులోని సొమ్మును ఎత్తుకెళ్లారు. రెండు రోజుల క్రితం రాంనగర్ కాలనీలో భద్రయ్య ఇంట్లో ఆరున్నర తులాల బంగారం, 30తులాల వెండి, టీవీ చోరీకి గురైందని బాధితులు చెబుతున్నారు. అదేవిధంగా తాజా ఓ ఆటోను కూడా గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకుపోయారని చెబుతున్నారు.

**పనిచేయని సీసీ కెమెరాలు**

గ్రామాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పని చేయటం లేదు. నెలలు గడుస్తున్నా వాటిని బాగు చేయించకపోవడంతో దొంగలు రెచ్చిపోతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

**ఇతర రాష్ట్రాల నుంచి వలసలు**

ఈ ప్రాంతంలో పారిశ్రామిక వాడలు ఉండటంతో ఇతర రాష్ట్రాల నుంచి వారు ఇక్కడికి వలస వస్తున్నారు. ముఖ్యంగా ఉత్తరప్రదేశ్, బిహార్ ప్రజలు పరిశ్రమల్లో పనిచేయడానికి వచ్చి ఉంటున్నారు. కొన్నిసార్లు వారికి ఉపాధి లభించక ఇలాంటి చోరీలకు పాల్పడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

**విచారణ చేపడుతున్నాం**



దొంగతనాలపై విచారణ చేపడుతున్నాం. పారిశ్రామిక వాడల్లో తనిఖీలు చేస్తున్నాం. అనుమానం ఉన్న వారిని విచారిస్తున్నాం. చోరీలకు పాల్పడ్డ వారిని త్వరలోనే అదుపులోకి తీసుకుంటాం. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలి. అనుమానం ఉన్న వారు కనిపిస్తే సమాచారం ఇవ్వాలి.

– లక్ష్మారెడ్డి, ఎస్‌ఐ, గుమ్మడిదల

# కారు బోల్తా.. ఒకరి దుర్మరణం


కుకునూర్‌పల్లి వద్ద రాజీవ్ రహదారిపై బోల్తా పడిన కారు

కొండపాక(గజ్వేల్): కారు అదుపు తప్పి బోల్తా పడటంతో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధి రాజీవ్ రహదారిపై కుకునూర్‌పల్లి వద్ద ఆదివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ పుష్పరాజ్ వివరాలు. నెల్లూరు జిల్లా ఏఎస్‌పేట మండలం అంబసాహెబ్‌పేట గ్రామానికి చెందిన గంగపట్నం వంశీ(25) హైదరాబాద్‌లోని అమెజాన్ కంపెనీలో పని చేస్తూ సెలవు రోజుల్లో తన కారును టాక్సీకి నడిపిస్తుంటాడు. ఇదే క్రమంలో మంచిర్యాలకు కిరాయి ఉండడంతో శనివారం సాయంత్రం వెళ్లి ఆదివారం ఉదయం నగరానికి తిరుగు ప్రయాణమయ్యాడు. కుకునూర్‌పల్లి సమీపంలోకి రాగానే అతివేగంగా వచ్చిన కారు రాజీవ్ రహదారిపై డివైడర్ పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొని అవతలి వైపు రోడ్డుపై పల్టీ కొట్టింది. దీంతో కారును నడుపుతున్న వంశీ అక్కడికక్కడే మృతి చెందాడు. కారు రోడ్డుపై పడడంతో కొద్దిసేపు ట్రాఫిక్ జాం అయింది. పోలీసులు అక్కడికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టి వంశీ మృతదేహాన్ని సిద్దిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి భార్య వెంకట సత్యవతి ఫిర్యాదు మేరకు కుకునూర్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### గృహిణి అదృశ్యం

మనోహరాబాద్(తూప్రాన్): మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గృహిణి కేసు నమోదైంది. ఆదివారం ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రం సంత్ రవిదాస్‌నగర్ జిల్లా అమౌవఖాడ్ గ్రామానికి చెందిన ధర్మేందర్ భారతి కాళ్లకల్‌కు వలస వచ్చి స్థానిక పరిశ్రమలలో పని చేస్తున్నాడు. జూన్‌లో నిషా అనే అమ్మాయితో వివాహమైంది. కాగా, ఆమె ఈ నెల 19న ఇంట్లోంచి చెప్పకుండా వెళ్లిపోయింది. ఎక్కడ వెతికినా ఆచూకీ లభించకపోవడంతో భర్త పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

**ఇంటి నుంచి వెళ్లిన యువతి..**


హరిత (ఫైల్)

పటాన్‌చెరు టౌన్ : పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో యువతి అదృశ్యం కేసు నమోదైంది. హెడ్ కానిస్టేబుల్ భీమ్‌రావు వివరాలిలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీకాకుళం పలాసకు చెందిన హరిత(20) పది రోజుల క్రితం పటాన్‌చెరు మండలం ఇంద్రేశం ఆర్‌కే నగర్ కాలనీలో ఉంటున్న పెద్దమ్మ శశికళ ఇంటికి వచ్చింది. 18వ తేదీ రాత్రి ఎవరికీ చెప్పకుండా హరిత ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తులో భాగంగా పోలీసులు సీసీ కెమెరాలు పరిశీలించగా ఇంటి నుంచి వెళ్లిన రోజు అర్ధరాత్రి ఓ యువకుడితో వెళ్తున్నట్లు గుర్తించారు.

# వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి ఆత్మహత్య

జహీరాబాద్ టౌన్: అప్పుల బాధతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మొగుడంపల్లి మండలం మన్నాపూర్‌లో చోటు చేసుకుంది. చిరాగ్‌పల్లి పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మన్సూర్ తుకారం(27) తన పెళ్లి కోసం, వ్యవసాయ పెట్టుబడికి చేసిన అప్పు తీర్చలేక మద్యంకు అలవాటు పడ్డాడు. శనివారం రాత్రి ఇంట్లో ఎవరూ లేనిసమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య రేణుక, ఏడాది పాప ఉంది. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నరేష్ తెలిపారు.

**ఆర్థిక ఇబ్బందులతో..**

కోహీర్(జహీరాబాద్): ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని ఖానాపూర్‌లో చోటు చేసుకుంది. ఎస్‌ఐ సురేష్ వివరాలు. గ్రామానికి చెందిన గత్ప నర్సింహులు(32) రెండేళ్లుగా కర్ణాటకలోని కుంచారంలో నివాసం ఉంటూ మగ్దుంపురం చౌరస్తా వద్ద టీ కొట్టు పెట్టుకొని జీవిస్తున్నాడు. ఆదాయం లేక కుటుంబ పోషణకు అప్పులు చేశాడు. శుక్రవారం అప్పుల వాళ్ళు పిలుస్తున్నారని చెప్పి కోహీర్‌కు వచ్చాడు. తరువాత ఏం జరిగిందో తెలియదు కానీ సాయంత్రం పురుగు మందు తాగానని ఇంటికి ఫోన్ చేసి చెప్పాడు. అపస్మారక స్థితికి చేరుకున్న అతన్ని కోహీర్ ఆస్పత్రికి, అక్కడి నుంచి సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం రాత్రి మరణించాడు. మృతుడికి భార్య జగమ్మ, నలుగురు పిల్లలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

# భవనంపై నుంచి పడి కూలీ మృతి

సిద్దిపేటకమాన్: ప్రమాదవశాత్తు భవనంపై నుంచి కింద పడి కూలీ మృతి చెందిన సంఘటన సిద్దిపేటలో చోటు చేసుకుంది. పట్టణ టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాలు. ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం కొండగావ్ మండలంలోని నాకనల్‌కు చెందిన సోరి హంతు, అనిత్, సంతు (25) ముగ్గురు అన్నదమ్ములు. జీవనోపాధి కోసం ఆరు రోజుల క్రితం సిద్దిపేటకు వచ్చారు. పట్టణంలోని నారాయణకు చెందిన బోరు బండిపైన వీరు లేబర్‌గా పని చేస్తున్నారు. అనిల్ బోరు బండిపైన పనికి వెళ్లగా, అనిత్, సంతు తోటి లేబర్లతో కలిసి భోజనం చేసి కరీంనగర్ రోడ్డులోని ఓ భవనంపైన శనివారం రాత్రి పడుకున్నారు. ఈ క్రమంలో సంతు నిద్రమత్తులో బిల్డింగ్‌పై నుంచి కింద పడటంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. తోటి కూలీలు అతడిని సిద్దిపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. వైద్యుడు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి అన్న ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు.

జగ్గారెడ్డి మా పార్టీలోకి వస్తే

# ఉపముఖ్యమంత్రిని చేస్తాం

- ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్


సమావేశంలో మాట్లాడుతున్న కేఏ పాల్

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి ప్రజాశాంతి పార్టీలో చేరితే ఎమ్మెల్యేగా గెలిపించి ఉపముఖ్యమంత్రిని చేస్తానని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ పేర్కొన్నారు. ఆదివారం మండలపరిధిలోని మద్దికుంట శివారులోని చారిటీ సిటీలో పార్టీ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను గెలిపించి ముఖ్యమంత్రిని చేస్తే నిరుద్యోగులకు లక్ష ఉద్యోగాలు కల్పిస్తానన్నారు. పార్టీ అభ్యర్థులను గెలిపించిన నియోజకవర్గాల్లో నిరుద్యోగులు లేకుండా చేస్తానన్నారు. బడుగు, బలహీన వర్గాల అభివృద్ధే పార్టీ లక్ష్యమన్నారు. పాలనా రావాలి.. పాలన మారాలి.. మార్పు రావాలి అనే నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. సామాజిక న్యాయం, అవినీతి లేని రాజ్యం, అందరికీ అధికారం, అభివృద్ధి తమ పార్టీతోనే సాధ్యమన్నారు.

# అవార్డు అందుకున్న సాక్షి ఫొటోగ్రాఫర్లు



అవార్డు అందుకుంటున్న కె.సతీష్, శివప్రసాద్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): తెలంగాణ ఫొటో జర్నలిస్ట్ అసోసియేషన్, రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన రాష్ట్రస్థాయి ఫొటోగ్రఫీ పోటీల్లో విజేతగా నిలిచిన సిద్దిపేట సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ సతీష్, సంగారెడ్డి జిల్లా సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ బి.శివప్రసాద్ ఉత్తమ అవార్డు అందుకున్నారు. ఆదివారం నగరంలోని రవీంద్రభారతిలో నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంలో ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు, సంక్షేమశాఖల మంత్రి కొప్పుల ఈశ్వర్ చేతుల మీదుగా వీరు ఉత్తమ ఫొటోగ్రాఫర్‌గా ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు.

# రాష్ట్ర స్థాయి జూడో పోటీల్లో ప్రతిభ


బ్రౌన్ మెడల్‌తో విద్యార్థులు

కోహెడరూరల్(హుస్నాబాద్): రాష్ట్ర స్థాయి జూడో పోటీల్లో మండలంలోని నాగసముద్రాల ఆదర్శ పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు ప్రిన్సిపాల్ నరేందర్‌రెడ్డి తెలిపారు. ఇటీవల కరీంనగర్ జిల్లాలోని మానేరు హైస్కూల్‌లో ఈనెల 19 నుంచి 20వరకు జరిగిన తెలంగాణ జూనియర్ ఇంటర్ జిల్లా జూడో చాంపియన్ షిప్‌లో పాఠశాలకు చెందిన 12 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో జెళ్ల నేహ, దాసరి శ్రీచరణ్, మద్దెల హరిత వెయిట్ విభాగంలో 3వ స్థానం సాధించి బ్రౌన్ మెడల్ సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, పీఈటీ భరత్‌రెడ్డిని ప్రిన్సిపాల్ అభినందించారు.

# క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతం


పంకజ్‌కు స్వాగతం పలుకుతున్న స్థానిక నేతలు

గజ్వేల్‌రూరల్: క్షేత్రస్థాయిలో బీజేపీ బలోపేతానికి కృషి చేద్దామని మహారాష్ట్రలోని వార్దా నియోజకవర్గానికి చెందిన బీజేపీ ఎమ్మెల్యే పంకజ్ రాజేష్ భోయర్ పేర్కొన్నారు. బీజేపీ పిలుపు మేరకు తెలంగాణలోని 119 నియోజకవర్గాల్లో 119 మంది బీజేపీ ఎమ్మెల్యేల పర్యటనలో భాగంగా గజ్వేల్ నియోజకవర్గ పర్యటనకు వచ్చిన ఆయనకు ఆదివారం ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రజ్ఞా గార్డెన్స్‌లో వారం రోజులపాటు చేపట్టనున్న కార్యక్రమాలపై దిశానిర్దేశం చేశారు. అనంతరం మాట్లాడుతూ.. బీజేపీని బూత్ స్థాయిలో బలోపేతం చేస్తూ అధికారంలోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు కప్పర ప్రసాదరావు, గురువారెడ్డి, శ్రీనివాస్, మనోహర్‌యాదవ్, మహేష్, సురేష్, అశోక్‌గౌడ్ పాల్గొన్నారు.

# వేట కోసం వెళ్లి.. శవమై ప్రత్యక్షం


రాజయ్య (ఫైల్)

పాపన్న పేట (మెదక్): 33 రోజుల క్రితం వేట కోసం వెళ్లిన ఓ వ్యక్తి అస్థిపంజరంగా కనిపించిన సంఘటన ఆదివారం మిన్‌పూర్‌గుట్టల్లో వెలుగు చూసింది. పాపన్నపేట ఎస్సై మహిపాల్‌రెడ్డి తెలిపిన కథనం ప్రకారం. కామారెడ్డి మండలం గాలిపూర్‌కు చెందిన అల్లం రాజయ్య (45) పాతికేళ్లక్రితం బతుకు దెరువు కోసం పాపన్నపేటకు వచ్చాడు. చేపలు, అటవీ జంతువులను వేటాడుతూ కుటుంబ సభ్యులతో జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో గత నెల 17న వేట కోసమని ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు అతని కోసం వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆదివారం మిన్‌పూర్ గుట్టల్లోని బండ రాళ్ల మధ్య అస్థిపంజరం ఉన్నట్లు గుర్తించిన మేకల కాపరులు పోలీసులకు సమాచారం అందించారు. అక్కడ దొరికిన గడ్డపార, దుస్తుల ఆధారంగా మృతుడు అల్లం రాజయ్యగా గుర్తించారు. ఈ మేరకు పోలీసులు అక్కడే శవ పంచనామా నిర్వహించి కేసు నమోదు చేశారు.